


"ఆగండి మీరు చాలా అదృష్టవంతులు. ఒక నిజాయితీపరుడికి మీ నోటు దొరికింది. కనుకనే మీకు దక్కింది" అంటూ నోటును అతనికి అందించేరు మేనేజరు చిరునవ్వుతో.

"చాలా థాంక్స్ సార్! వంద రూపాయలు నిష్కారణంగా పోగొట్టుకున్నానని చాలా బాధపడ్డాను. మీ దయవల్ల దొరికింది. నోటు ఇచ్చిన ఆయన ఎవరో కాని దేముడు సార్. అతను మళ్ళీ మీ వద్దకు వస్తే నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపండి" అంటూ మరీ మరీ థాంక్స్ చెప్పి వెళ్ళిపోయేడు ఆ వ్యక్తి.

రెండు రోజుల తరువాత బ్యాంకు అపాయింట్‌మెంటు ఆర్డరు అందుకున్న సుబ్బారావు మేనేజరు ఎదుట నమస్కరించి నిల్చున్నాడు.

"నీ నిజాయితీయే నీకు ఉద్యోగం తెప్పించిందోయ్. ఆ రోజు నీకు దొరికిన వంద రూపాయల నోటు దాని స్వంతదారుని వద్దకే చేరింది నీలాంటి నిజాయితీపరులకే మా ఆఫీసులో స్థానం" అంటూ సుబ్బారావుని తెగ మెచ్చుకున్నారు మేనేజరు.

కాని సుబ్బారావు అపాయింట్‌మెంటు ఆర్డరు అందుకున్న సాయంత్రమే హోటల్ మేనకలో మందు. చికెన్. బిర్యానీల రూపంలో ఆ నోటు సుబ్బారావు. నోటు పోగొట్టుకున్నట్లు నటించిన ప్రఖ్యాత స్టేజి నటుడు సుబ్బారావు మేనమామల కడుపుల్లో దాక్కున్నట్లు పావం మేనేజరు గారికి తెలియదు!

---

# తెల్లబోయిన లౌక్యం

## శివలెంక లక్ష్మీదేవి

"రండి. రండి. ఇంతమంది పెద్దలు నా ఇంటిని పావనం చేశారు" అంటూ పెద్దలందరినీ ఆహ్వానించాడు చెన్నకేశవులు. వచ్చినవాళ్ళంతా కూర్చున్నాక మునసబుగారు మొదలుపెట్టారు. "కేశవయ్యగారూ. మీ బావమరదిగారి రెండో




అమ్మాయి మాలతిని మీ అబ్బాయి కివ్వాలని వారి సంకల్పం-మీరు అంగీకరిస్తే...."

"ఇంతమంది వస్తే కాదంటానా. కాని పెద్దమ్మాయ సుమతికి కాకుండా చేస్తారా?" సందేహంగా అడిగాడు చెన్నకేశవయ్య.

"సుమతిక్కూడా కుదరబోతోంది బావగారూ. రేపొస్తారు పెళ్ళివారుమాట్లాడుకోటానికి. రెండు పెళ్ళిళ్ళు ఒకే ముహూర్తానికి చెయ్యాలని నా కోరిక" సంతోషంగా అన్నాడు వెంకట్రామయ్య.

"పెళ్ళికొడుకు ఏం చేస్తున్నాడు?"

"ఇంజినీరు".

"అలాగా!. సంతోషం".

"మరి మిగతా విషయాలు మాట్లాడితే శలవు తీసుకుంటాం" మునసబుగారు లౌక్యంగా కట్నం సంగతి ఎత్తారు.

చెన్నకేశవులు నవ్వాడు.

"మా బావగార్ని ఇంతివ్వమని నేనడుగుతానా? పెద్దల్లుడికి ఎలా ఇస్తారో అలాగే ఇవ్వండి".

చెన్నకేశవులు తెలివికి అంతా ఆశ్చర్యపోయారు. పెద్దల్లుడు ఇంజినీరు. రెండో అల్లుడు వ్యవసాయం. ఐనా ఆ తేడా గురించి ఎవరూ ఎత్తలేదు. అందరూ సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

మర్నాడు పిలుపు వచ్చింది చెన్నకేశవులకి పెళ్ళివారు వచ్చారని. మాట్లాడుకోటానికి రమ్మని. కట్నం సంగతి అడిగారు ఇంజినీరు తండ్రిని.

చెన్నకేశవులు ఇంజినీరు తండ్రి వంక ఆశగా. కుతూహలంగా చూస్తున్నాడు-ఆయన నోటి వెంట రాబోయే లకారాలు ఎన్నో అని.

ఇంజినీరు తండ్రి చేతులెత్తి నమస్కారం చేస్తూ. "బాబూ! నా కొడుకుని అమ్మను. ఎందుకంటే మళ్ళీ ఇలాంటి కొడుకుని కనలేను కాబట్టి. వేలం వెయ్యలేను-ఎందుకంటే మా తలకి కొరివి పెట్టాల్సింది వాడే కాబట్టి. మా క్కావలసింది కోడలుమాత్రమే. మావాడికి బేరం పెట్టి బానిసని చెయ్యటానికి కాదు దయచేసి కట్నం పేరెత్తకండి. ముహూర్తాలు చూడండి" అన్నాడు.

అంతే- చెన్నకేశవులుకి నోట మాట రాలేదు: ఎందుకంటే ఇంజినీరంటే ఏ రెండు లక్షలో అడుగుతాడని ఊహించి తన కొడుకు విలువ యాభైకి మించదని గ్రహించి అల్లుడికి ఇచ్చినట్లే ఇవ్వమని లౌక్యం వెలగబెట్టాడుకదా. అందుకు!